# ఆవేశనం

★

డా॥ దమ్మ శ్రీనివాసబాబు

నడినెత్తి కెక్కిన సూర్యుడు "నాగుండె ఎలా మండుతోందో చూడండి" అంటూ తనలో రగిలే వేడిని అందరికీ పంచుతున్నాడు.

కాలింగ్ బెల్ నొక్కింది శారద తలుపు తీసింది లత. నవ్వి తలుపు కడ్డం జరిగి.

"యింత పండు వెన్నెల్లో అర్థమొగుడు గారు యిలా దయచేశారేమిటి?" అంది.

"అన్నయ్య ఎలాగూ ఉండడు కదా వదినతో డ్యూయెట్ పాడదామని. సరేగాని ముందు మజ్జిగ, ఆ తరువాత నీళ్ళు యిస్తేనే మాట్లాడతాను" అంటూ లోపలికి నడిచింది.

"ఆడబిడ్డ అధారిటీ మరి తప్పుతుందా" వంటగదిలోకి పద" అని నవ్వుతూ శారద చేయిపట్టుకొని లోపలికి లాక్కెళ్ళింది.

"వదినా" అన్నయ్యకీరోజు డ్యూటీ ఉందా."

"ఈరోజు వాళ్ళ ఓ.పి. కదూ కాసేపట్లో రావచ్చు. ఏమ్మా అన్నయ్యతోనే అర్జంటు పనా?"

"అవును ఉదయం కాలేజీలో నేను క్లాసు తీసుకుంటున్నప్పుడు ఓ ఐడియా వచ్చింది. దానికి సైన్స్ సపోర్ట్ ఎంతగా ఉందో అన్నయ్య నడిగి తెలుసుకోవాలి. తెలిస్తే నువ్వే చెప్పు"

"యం. ఏ చదివిన నీ డౌట్స్‌ను కాలేజీ మెట్లెక్కని నేను ఎలా తీర్చగలను? పోనీ భారతి నడగకపోయావా?"

"సైన్స్ డౌట్ అనీ, భారతి యం.యస్సీ అని అడగమంటావ్. అంతేనా నో డాక్టర్లే క్లారిఫై చేయాల్సి ఉంటుంది. ఆ మజ్జిగలో యిప్పటివాకా వేసిన కొత్తిమీర చాలు,యిలాతే. నాలుక ఎండిపోతోంది" అని మజ్జిగ గ్లాసులో పోసుకొని గడగడా తాగేసింది చూస్తూ నవ్వుతూ కూర్చుంది లలిత.

శారద,భారతి,శ్రీదేవి, సర్వమంగళాదేవి. శైలజ వీళ్ళు లతకు ఆడబిడ్డలు. డాక్టర్ మోహన్ చెల్లెళ్ళు. ఒకరిమీద ఒకరు విసుర్లు విసురుకుంటూ నవ్వుకుంటూ, ఆడపాదడపా అలకలతో, బుంగమూతులతో మంచి కాలక్షేపంగా పీలవుతుంటుంది లత.

అత్తా మామగార్లు మిగిలిన ఆడబిడ్డలు మరుదులు బెంగుళూరులో ఉన్నారు. డాక్టర్ మోహన్ హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. శారద, భారతీలకు పెళ్ళిళ్ళయాయి.

శారద యం. ఏ. భారతి యం. యస్సీ. యిద్దరూ ఉమెన్స్ కాలేజీలో లెక్చెరర్లు. హైదరాబాద్‌లోనే ఉంటున్నారు.

బెల్ మోగింది.

"మీ అన్నయ్యో, మరో అర్థమొగుడో– ఐమీన్ భారతో అయి వుంటారు" అని తలుపు తెరవడానికని వెళ్ళింది.

"ఏమండోయ్ శ్రీవారూ! యింతా లస్యంగా వచ్చారు?"

'గుమ్మంలో అడుగు పెట్టానో లేదో అప్పుడే సాధించడం మొదలెట్టావా?' చిరు కోపంతో నవ్వుతూ అన్నాడు డాక్టర్ మోహన్.

"మా అన్నయ్యనిలా వేపుకు తింటున్నావనుకోలేదొదినా?" అంది శారద.

వంటింటి కేసి తొంగి చూసింది లత.

"అటు చూస్తున్నావేమిటి?" అంది శారద.

"వేపుడు వాసన నాకు రావడం లేదేమిటా అని."

మోహన్, శారదలు నవ్వేశారు.

"ఏరా ఎంత సేపయిందొచ్చి?" శారదను పలకరించాడు మోహన్.

"గత రెండున్నర యుగాల్నుంచీ ఐమీన్ రెండున్నర గంటల్నుంచీ మీ చెల్లాయిగారు నా ప్రాణాల్ని తోడేశారు" ముసి ముసిగా నవ్వుతూ అంది లత.

"ఇంత అబద్ధాల కోరుతో సంసారం చేస్తున్న మా అన్నయ్య ఓర్పుకు హేట్సాఫ్" అంది శారద.

"ఊఁ" అని బుంగమూతి పెట్టింది లత.

"వదినా అలాబుంగమూతి పెడితే అన్నయ్యకెలా ఉంటుందో గానీ నాకు మాత్రం ముద్దెట్టుకోవాలనిపిస్తోంది. వస్తున్నా" అంటూ ముందుక్కదిలింది.

"ఛీ.... సిగ్గు లేకుండా ఏమిటది?" దూరం జరిగి నవ్వుతూ అంది లత.

వాళ్ళిద్దరి మాటల్ని వింటూ నవ్వుకుంటూ సోఫాలో కూర్చొని షూ విప్పుకుంటున్నాడు మోహన్.

లత లోపలికెళ్ళింది. శారద వెంట నడిచింది.

"వదినా! నీ ఒంట్లో కెవరైనా వచ్చారా" అడిగింది.

"నా ఒంట్లోకా?" నవ్వి "మూడు నెలల క్రితమే నీకో మేనల్లుణ్నిచ్చాను. గుర్తులేదా? హవ్వ... నోరు నొక్కుకుంది.

"ఛీ....ఎప్పుడూ పోకిరీ మాటలే. పోకిరీ ఊహలే. అది కాదొదినా దయ్యమూ, దేవుళ్ళూ ఒంట్లో కొస్తుంటారు చూడు. అలాంటివి."

"ఓహో! అలాంటివా మన జోలికిరావు. ఎందుకో తెలుసా? నేనే ఒక దయ్యాన్నని మీ అన్నయ్య నవ్వుతూ అంటుంటారు. మరి దేవుడంటావా పెళ్ళికాకముందు అమ్మా నాన్నగార్లు. పెళ్ళయాక కట్టుకున్న మీ అన్నయ్య"

"ఏది సీరియస్‌గా అడిగినా జోక్‌గా కొట్టి పారేస్తావ్. ఎలా వేగాలో ఏమో? నువు మజ్జిగగ్లాసు పట్టుకురా. నేను నీళ్ళగ్లాసు పట్టుకొస్తాను" అని వంటగదిలోంచి డ్రాయింగ్ రూంలోకి నడిచారిద్దరూ.

"మీ చెల్లాయి డౌట్స్‌తో నాకు పిచ్చెక్కిపోతోంది ఏమిటో చూడండి" అంది లత మజ్జిగ గ్లాసందిస్తూ.

ఏమిటన్నట్టు శారద కేసి చూశాడు మోహన్.

"అవునన్నయ్యా! ఒంట్లోకి దేవుడు, దయ్యం-ప్రకృతి వికృతులే ననుకో-రావడమంటే ఎలా? వాటిని మీ మెడికల్ సైన్స్ ఎందాకా సపోర్ట్ చేస్తుంది? అసలవి నిజాలా కావా?" అంది శారద మోహన్ కెదురుగా కూర్చుంటూ. ప్రక్కనే కూర్చుంది లత.

"చాలా పెద్దప్రశ్న. ఎక్కడ్నుంచిమొదలెట్టాలో తెలియని ప్రశ్న. దానికి ముందు జీవాత్మ, పరమాత్మల్ని గురించి వేదాంతం చెప్పాల్సి ఉంటుంది".

"వద్దు మహాప్రభో!పరమబోరు" అంది లత ముసిముసిగా నవ్వుతూ. రెండు చేతులూ జోడించి.

"వదినా! ప్లీజ్. నో జోక్స్" ప్రతిమాలింది శారద.

గొంతు సవరించుకున్నాడు మోహన్.

"ఒంట్లోకి ఏదో శక్తి ప్రవేశించడాన్ని 'ఆవేశనము' అంటారు, అది రెండు రకాలు. ఒకటి ఇన్స్పిరేషన్ బై ది డెయిటీ ( Inspiratiaon by the deity ) అంటే దైవ సంబంధమైన శక్తులు ఆవరించడం.

రెండు పొసెషన్ బై ది ఈవిల్ స్పిరిట్స్ (Possession by the evil spirits) అంటే దయ్యం పట్టడం, పిశాచం ఆవరించడం ఎట్సెట్రా అన్నమాట."

"అవి నిజంగా జరుగుతాయా?"

"అబద్ధాలని కొట్టెయ్యడానికి వీల్లేదు. నిజాలని నిరూపించేందుకు సరైన ఆధారాలు లేవు.

"నాన్నగారు చెపుతుండేవారు. చెన్నకేశవస్వామి తిరునాళ్ళప్పుడు ఛాతీమీదంతా ఏదో వీరగంధం అనేది పూసుకొని కత్తులతో నరుక్కుంటారట. దేవుడు ఆవేశించడం వలన గాయాలేం కావట. అదేనా?"

"అఫ్‌కోర్సు? అన్నట్టు సమయానికి గుర్తుచేసావ్. పల్లెటూళ్ళలో భూతవైద్యులనబడే వాళ్ళు అక్కడి ప్రజల అమాయకత్వాన్ని, ఆవేశనం లాంటి వాటి మీదున్న నమ్మకాన్ని ఆసరా చేసుకొని తమ పబ్బం గడుపుకుంటుంటారు. లాస్టియర్ నేనూ, మీ వదినా కలసి ఒక ప్రైమరీ హెల్త్‌సెంటర్ కెళ్ళాం. అక్కడ మేం చూసిన సంఘటన్ని మిమిక్రీ చేస్తాను. ఏయ్ లతా! గుర్తుందిగా. నేనా భూతవైద్యుడి రోల్ తీసుకుంటాను. ఆ ఇంటి యజమాని రోల్ నువ్వు. సరేనా" అని సోఫాలోంచి లేచాడు మోహన్.

"అంతగా గుర్తు లేదండీ. సరే మీరు మొదలెట్టండి. సమయానుకూలంగా యాక్ట్ చేస్తాను." అంది లత లేచి పైట నడుముకు బిగించుకుంటూ.

"రెడీ స్టార్ట్" అని సోఫాలో కూలిపోయాడు మోహన్.

గాభరాపడి "అన్నయ్యా" అని అరిచింది శారద.

"డోంట్‌వరీ ; యాక్షన్" అని శారద భుజం తట్టింది లత.

"ఒరేయ్ ; ఊఁ ; నేన్రా. పోలేరమ్మను ఊఁ" అంటూ లేచి ఊగడం మొదలెట్టాడు మోహన్.

"తల్లీ ; దండాలల్లే, ఏమేం సేయాలో సెప్పు తల్లే" అంటూ టీపాయ్ మీదున్న న్యూస్‌పేపర్‌తో విసురుతూ, ఊగుతున్న మోహన్ని పట్టుకొని అంది లత.

శారదకు నవ్వాగడం లేదు.

"ఒరేయ్ ; నాకు శాంతి చేయించాల్రా ;

"అట్లనే తల్లే, ఏమిచ్చుకోవాలో సెప్పుకో తల్లే"

"ఒక మేకపోతు కావాల్రో"

"అట్లనే తల్లే"

"అంతే కాదురోయ్. మరి నన్ను నమ్ముకున్న నా భక్తుడికి అన్యాయం చేస్తావ్రా!"

"శెతల్లే ; ఏమిచ్చుకోవాలో సెప్పు"

"వాడికి నన్ను నమ్ముకున్న నా భక్తుడికి రెండేళ్ళ నుంచీ బట్టల్లేవురోయ్. రెండు జతల బట్టలు పెట్టు"

"సరే తల్లే అట్లనే పెడ్తా"

"మరి వాడి భార్యకురా? రెండు చీరలు పెట్టు"

"మంచి తల్లే ; అవీ పెడతా."

"దక్షిణ సంగతి మరిచిపోయావా? నా భక్తుడికి పదిరూపాయ లిచ్చుకోరో. అప్పుడే నేనీ ఇంట్లోంచి పోతారో .... అరరర...." అంటూ ఊగిపోతున్నాడు.

"దిగుతల్లే దిగు ఇదో అరతి పట్టా" అంటూ విసురుతున్న న్యూస్ పేపర్‌నే హారతి పళ్ళెంగా తిప్పింది లత.

తిప్పుతున్న పేపర్ మీద చేయి పెట్టి ఏదో ఉన్నట్టు గుప్పిటితో పట్టుకుని నోట్లో వేసుకున్నట్టు వేసుకొని మళ్ళీ పడిపోయాడు మోహన్.

నవ్వు ఆపుకోలేక కడుపు చేత్తో పట్టుకొని లేచి నిలబడింది శారద.

"నవ్వకు" అన్నట్టు సీరియస్‌గా చూసింది లత. పైట నోటికడ్డంగా పెట్టుకుంది శారద.

లేచి "అబ్బా ఒళ్ళేమిటి ఇంత బరువుగా ఉంది" అన్నాడు మోహన్.

"అదేమిటండీ! మిమ్మల్ని పోలేరమ్మోరు ఆక్రమించేసుకున్నారు కాదండీ. అందుకే ఏనుగెక్కి తొక్కినంత బరువుంటాది." అంది లత.

"ఏమిట్రా? పోలేరమ్మ తల్లి ఏమేం చెప్పిందిరా?"

"మేకపోతును బలివ్వమందండీ"

"అంతేనా?"

"అంతే సామీ!"

"మరి నా సంగతేమీ చెప్పలేదా?"

"లేదు సామీ!"

"బాగా గుర్తు చేసుకో నాకేవో పంచల జత పెట్టమన్నట్టు గుర్తు"

"అవున్సామీ! పండగెల్లి నాంక పెడ్తా"

"అంతేనా?"

"అంతే సామీ!"

"ఒరేయ్! మళ్ళీ గుర్తు చేసుకో మా ఆడదానికి రెండు చీరలు పెట్టమని చెప్పినట్టు గుర్తు"

"అవున్సామీ! అయితూడా పండగెల్లినాంకే పెడ్తా!"

"అంతేనా యింకా ఏమన్నా చెప్పిందా?"

"యింకేం సెప్పలే సామీ అంతే"

"మరి దక్షిణ పదిరూపాయలేవో యిచ్చుకోమన్నట్టు గుర్తు"

"అవున్సామీ వస్తుతానికంత లేదు. ఈ రెండ్రూకలుంచండి సామీ!" అంటూ పైట చెంగు ముడి విప్పినట్టు విప్పి అందులోంచి తీసి యిచ్చినట్టు మోహన్ చేతిలో పెట్టింది లత.

అందుకున్నాడు మోహన్, ఉండబట్టలేక గట్టిగా నవ్వేసింది శారద.

'కట్' అంటూ నవ్వాడు మోహన్.

"ఇలాంటి సీన్ ఏదో సినిమాలో చూసినట్టుంది" అంది శారద యింకా నవ్వుతూనే.

"అవును, సినిమాల్లోనూ, పల్లెటూళ్ళలోనూ అమాయకుల్ని బుట్టలో ఎలా వేసుకోవడమో చూడ్డం జరుగుతుంటుంది" అని లత పైపు తిరిగి.

"వండ్రఫుల్!" అసలు ఆ రోజు చూసిన సీన్లో కంటే నువే బాగా యాక్ట్ చేశావోయ్" అంటూ చిలిపిగా భుజంమీద కొట్టాడు మోహన్.

"సరేలెండి యిమిటేషనూ ఒక యాక్ష

## అలకించు తెలుగన్నా!

తెలుగన్నా ఎందుకలా
దిగులుతో వున్నావ్?
దిగులుమాని ఆలకించు
నిన్నెవరో పిలుస్తున్నారు.
బాధల భారంతో
హృదయావేదనతో
ఏకాకిగా ఎందుకలా
కుమిలి కుమిలి పోయేవు?
నిన్నెవరో పిలుస్తున్నారు
చెవులొగ్గి ఆలకించు
ఆ పిలుపులో
ఆత్మీయతుంది.
అణువణువునా
అనురాగముంది,
మాటల కందని
మహా శక్తేదో
లీలగా కన్పిస్తోంది.
నా మాటలో నిజముంది
నమ్ము నా తెలుగన్నా!
నీకే భయమొద్దని
నీ కభయమిస్తున్నది-
వసంత లక్ష్మిని,
కోకిల గానాన్ని
వెంట బెట్టుకొని
వస్తోంది సరిక్రొత్తగా
సిద్ధార్థి ఉగాది.

—కొల్లు రంగారావు

నేనా?" అని పైటతో ముఖం తుడుచుకుంది లత.

"మార్వలెస్ వదినా! నీ యాక్షన్‌లోని నాచురాలిటీకి, డైలాగ్ మాడ్యులేషన్‌కి హ్యాట్సాప్ కంగ్రాట్స్" అంది లతను కౌగలించుకొని.

"యిదేమిటి అర్థముగుడి పవి" అంది లత నవ్వుతూ.

"ఛ. ఎప్పుడూ అదే డైలాగా?" అంది నవ్వుతూ చేయిపట్టుకొని.

"చూడ్రా శారదా, యిలా దేవుళ్ళు తమ ఒంట్లోకొచ్చారని అమాయకుల్ని నమ్మించి తమ పబ్బం గడుపుకునే వాళ్ళు ఉండడం వల్లే నిజంగా దైవశక్తులు ఆవహించిన వాళ్ళను నమ్మలేని స్థితిలో ఉన్నాం మనం. ఇకపోతే పొసెషన్ బై ది యీవిల్ స్పిరిట్ గురించి చెబుతాను."

"మన చిన్నప్పుడు అమ్మకు గాలి అనేది పట్టిందనీ ఏన స్మారకంలో లేకుండా ఏవేవో మాట్లాడుతుండేది. నీకు గుర్తుందో లేదో మరి. అలాంటి వాటినే దయ్యం పట్టడం అంటారు"

"నాకు గుర్తు లేదు. అప్పుడప్పుడు నువ్వూ, నాన్నగారు, అమ్మా, అత్తయ్యా, మాట్లాడుకుంటుండగా యీ దయ్యం పట్టడాన్ని గురించి విన్నట్టు లీలగా గుర్తుంది"

"ఏమండోయ్! దయ్యం పట్టినట్టు యాక్ట్ చేయమంటే మాత్రం నాచేతకాదు" అంది లత మూతి తిప్పుతూ.

"నువ్వుండగా నిన్నింకో-దయ్యంపట్టడమే యింపాసిబుల్. అలాంటి దేదైనా వస్తే నిన్ను చూసి అదిరిపోవాల్సిందే" అన్నాడు మోహన్ పకపకా నవ్వుతూ.

"చూశావా తల్లీ! యిదీ మీ అన్నయ్యగారి వరస. ఆయనకు నేను దయ్యంలా కాకపోతే వాళ్ళ కొలీగ్ సుజాతలా కనిపిస్తానేంటి?" అంది చిరుకోపంతోనే అయినా, నవ్వు రానీకుండా పంటితో పెదవి నదుముతూ.

"యిద్దరికిద్దరే" అని...." చెప్పన్నయ్యా వదినకిది మామూలేగా" అంది శారద.

నవ్వేసింది లత.

"శరీరాన్ని విడిచి పెట్టిన ఆత్మ - గీతోపదేశం ప్రకారం ఆత్మకు చావులేదు. ఎండకు ఎండదు. వానకు తడవదు. నీటిలో నానదు అగ్నిలో కాలదు. యిలా.... యిలా...."

"అలా అలా దారి ప్రసంగం వల్లేరు యీది బండిలా సాగి సాగి సాగి పోతూనే ఉంటుంది." అని పూర్తిచేసింది లత.

"మధ్యలో అడ్డు తగలొద్దని చెబితే ఏమిటీ అబ్‌స్ట్రక్షన్?"

"యింతకు ముందర చెప్పనే లేదంటి"

"యిప్పుడు చెబుతున్నాను."

"యస్. మిలార్డ్. యూకెన్ ప్రొసీడ్" అంది స్టైల్‌గా లాయర్‌లా తలవంచుతూ.

"కొంటె లత" అని తలమీద మొట్టాడు మోహన్.

"యింత గట్టిగా కొట్టేది." అంది లత బుంగమూతితో.

"సారీ డియర్" అన్నాడు మోహన్.

"రామాయణంలో పిడకల వేటలా ఓ టీజ్ దిస్," కోపంగా అన్నట్టు అని- నేను వెళ్ళి పోయింతరువాత మీ దిద్దరే ఉంటారు గనక ఆలోగా నిద్రపోతున్న బాబిగాడు లేవకుండా ఉంటే ఆ ప్రణయకోపాలూ గట్రా తీర్చుకోండి. అందాకా దే ఆర్ సస్పెండెడ్" అంది శాంత గట్టిగా నవ్వేసి.

"థాంక్యూ మిస్టర్ జస్టిస్" అన్నారు మోహన్, లత ఒకేసారిగా.

ముగ్గురూ ఒక్కసారి నవ్వేశారు.


"కమింగ్ టు ది పాయింట్. శరీరాన్ని వదిలేసిన ఆత్మ అనంత వాయువుల్లో తిరుగుతూ తనక్కావాల్సిన ఆధారం కోసం వెతుక్కుంటూ ఉంటుందిట. మానసికంగా బలహీనంగా ఉన్నవాళ్ళ ఆత్మను నెట్ చేసి శరీరంలో జొరబడుతుందిట. ఈ సిద్ధాంతం ఆధారంగా ఆ మధ్య ఏదో సినిమా కూడా వచ్చిందిట."

"జస్ట్ ఎ మినిట్.. ఎన్ని ఆత్మలైతే ఒక పరమాత్మ అవుతుంది?"

"ఓ చిట్టి మరదలూ? యివి లెక్కలు కావు తల్లీ- యిన్ని ఆత్మలూ యీక్వల్ టు ఒన్ పరమాత్మ అని. జీవమున్న ప్రతి ప్రాణిలోనూ వెలిగే జ్యోతి ఆత్మ. పరమాత్మ నిత్యం ప్రకాశించే ఒక పెద్ద జ్యోతి ఆ అంశమే జీవాత్మ ఒక దీపాన్ని యింకో దీపంతో వెలిగించినట్టు- ఐమీన్ ఆత్మ అన బడే కాంతి జీవిలోకి ప్రవేశించి జీవాత్మ అవుతుంది నాకు తెలిసిందింతే" అంది లత తన భర్త తనకేసి ఆశ్చర్యంగా చూడడం గమనించి.

"సమెక్స్‌సెంట్ యూ ఆర్ రైట్, మైడియర్ బెటర్‌హాఫ్! వేదాంతమంటే బోర్ అనే మీ వదిన దగ్గర నేనిక చాలా నేర్చుకోవాలి." అన్నాడు మోహన్.

"చాల్లెండి. నిజమే అనుకొని మామయ్యగారికి ఉత్తరం వ్రాస్తుంది శారద. ఇదంతా పావన దోషమని వాళ్ళకేం తెలుసు?"




అంది ముసిముసిగా నవ్వుతూ.

"ఆత్మ పరమాత్మలో లీనమవడమంటే పునర్జన్మ లేకపోవడ మన్నమాట అకాలంగ మరణించిన వ్యక్తుల ఆత్మలు ఎక్కడికెళ్ళాలో తోచక, ఆధారంలేక గాలిలో తిరుగుతుంటాయనడం ఎట్సెట్రాల్ని నిరూపించడానికి గానీ, సంతృప్తికరమైన చర్చకు గానీ అందవు. ఆత్మకు ఎలాంటి రూపం ఉందో ఇంతవరకు ఎవరూ చెప్ప లేదు కానీ ఉల్లిపాయను ఉదాహరణగా చెప్పారు ఉల్లిపాయ లోపల ఏముందో చూడాలని పిస్తుందనుకో. పొరను తీస్తున్న కొద్ది పొర. పొర తరువాత పొర. అలా అలా చివరిపొర తీసేసి చూస్తే అందులోనూ ఏమీ వుండదు. అంతా హుళక్కి. అంతే. జీవాత్మ ఓ నిషిలో ఎక్కడ ఏ రూపంలో ఉంటుందో అంతుబట్టని విషయంగా మిగిలి ఉంటుంది."

లత అద్భుతగిలి—"మన వయసుకు అలాంటి విషయాలు ఒంటబట్టవు శారదా! వేదాంతాన్ని గురించి తెలిసినట్టు. చదివినవి చదివినట్టు రీప్రొడ్యూస్ చేసినా చిలక పలుకుల్లాగే ఉంటాయి తప్పించి. తీరాచూస్తే అర్థమయిందేమీ ఉండదు. సో. నీ సందేహాల భాగాన్ని లేదా అస్త్రాన్ని ఉపసంహరించుకో, లేకపోతే మీ అన్నయ్య అలా చెప్పుకు పోతూనే ఉంటారు. అర్థం కాకపోయినా అర్థమైనట్టు తలలూపాల్సి ఉంటుంది నీ స్టూడెంట్స్‌లాగా" అంది నవ్వుతూ.

"అవునొదినా? అలాగే అనిపిస్తోంది" అంది శారద మెల్లగా.

"శ్రోతలు విముఖులైతే నేనింకేం చెప్పాలి?" అన్నాడు మోహన్ నీరసంగా.

"నీరసం వదిలించుకుని ఏవైనా సరదా కబుర్లు చెప్పండి. సరదా కబుర్లు చెప్ప మన్నాను కదా అని మీ కొలీగ్‌తో తిరిగిన షికార్ల సంగతి చెబితే మాత్రం నేనూరుకోను" అంది లత.

"యింత అనుమానాల మనిషిని కట్టుకొని వేగుతున్న నాకు మనశ్శాంతిని. మనోధైర్యాన్నీ ప్రసాదించు స్వామీ" అని ఎదురుగా ఉన్న శ్రీనివాసుడి ఫొటోకు ముసిముసిగా నవ్వుతుంటూ చేతులు జోడించాడు మోహన్.

లత నవ్వింది. శారదా నవ్వింది.

"ఇంతకూ ఆవేశనం గురించి ఎందుకడిగావో చెప్పలేదేమ్మా" అన్నాడు మోహన్.

"అన్నం తింటూ చెబుతుంది. వింటూ తిందాం లేవండి" అని ఒక చేత్తో మోహన్ని యింకో చేత్తో శారదను పట్టుకొని డైనింగ్ టేబుల్ దగ్గరికి తీసుకెళ్ళింది లత.

* * *

నా కొలీగ్ వసుంధర వాళ్ళింట్లో జరిగే సంఘటనలు చెప్పింది. వాళ్ళ ఆడపడుచు అత్తగారు వారానికొకసారి ఉన్నటుండి పడిపోతుందిట. పూనకం వచ్చినట్టు ఊగిపోతూ, కోడలిమీద ఏవేవో అభియోగాల్ని చెబుతుంటుందిట. ఆమెకు నవ్వు, కోపం రెండూ వచ్చేవిట. నిజంగానే ఒంట్లోకి దేవత వొచ్చిందో లేదో, అసలు సెన్సెస్‌లో ఉందో లేదో కనుక్కుందామని ఒక రోజున హారతి పళ్ళాన్ని చేతికి తగిలించిందట. చురుక్కుమనడంతో చేతిని వెనక్కు తీసుకొని కళ్ళు తెరిచి, తనకోడలు తననే గమనిస్తుండడంతో గబుక్కున కళ్ళు మూసేసుకుందట. ఆమెకలా వచ్చే మాయా ఆవేశనాన్ని ఎలా

మాన్పాలో నలహాయిమ్మని వసుంధర నడిగిందట. వసుంధర నన్నడిగింది. నేనో ప్లాన్ వేశాను. రిజల్ట్ వచ్చేవారం చెబుతాను. థాంక్స్ ఫర్ యువర్ ప్రెషస్ యిన్ఫర్మేషన్" అంది శారద

* * *

కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు ముగ్గురూ. బాబిగాడి ఆటలు, కేరింతలు, చిలిపి పనులు చూస్తూ నవ్వుకుంటున్నారు. అంతలో- "ఏమ్మా శారదా! మీ కొలీగ్ ఆడపడుచు ఆవేశనం ఎక్స్‌పెరిమెంట్ ఏమయింది!" అడిగాడు మోహన్.

"ఆ సంగతి చెబుదామనే వచ్చాను" అని నవ్వాపుకొని చెప్పడం మొదలెట్టింది.

"వసుంధర ఆడపడుచు అత్తగారు వారానికొకసారి పడిపోవడం - తరువాత ఉద్యోగం చేస్తున్న తన కోడలు డబ్బును చాటుగా పుట్టింటికి పంపిస్తోందనీ, పిల్లల్ని పట్టించుకోవడం లేదనీ, తన కూతుళ్ళను సరిగా చూడ్డం లేదనీ యిలా ఏవేవో అంటుండేదిట. నిజమైన ఆవేశనమే అయితే కళ్ళముందు జరిగే వాటిని చూసినట్టు చెబుతుందా? అసలు తానలాంటి పేపీ చేయకపోయినా అపోహలతో అనుమానాలతో అందరి అనురాగానికీ దూరం చేయడం పవిత్రత ఉన్న ఏ ఆవేశనం మటుకు ఎందుకు చేస్తుంది అన్న సందేహం వచ్చిందిట. తరువాత కథ నేన్నడిపాను. ఒక మంచి రోజున ఆ అమ్మాయిని పడిపొమ్మన్నాను. ఆ అమ్మాయి పేరు చెప్పలేదు కదూ! పల్లవి"

" పల్లవి. స్వీట్ నేమ్ " అన్నాడు మోహన్.

"ఊఁ!" గుర్రుగా కోపంగా చూసింది లత.

" ఏమాత బుద్ధో ఏమో ? ఫలానా అమ్మాయిపేరు బాగుందన్నా తప్పే ! అనుమానమే !! " అన్నాడు మోహన్ భయపడి పోతున్నట్టు.

"స్టాపిట్" అని కసురుకుంది శారద నవ్వుతూ.

"అలాగే ఒక శుభసమయంలో పల్లవి పడిపోయిందిట. ఆవహించిన శక్తిలా - "మీ అత్తయ్యకు మాటిమాటికీ పట్టేదయ్యం నా ప్రత్యర్థి. అబద్ధాలు చెప్పడమే దాని అలవాటు. అదెలాగూ మీ అత్తయ్యను వదలదు గనుక మీ అత్తయ్యకు దూరంగా నాతో వచ్చెయ్ ...." ఎట్ సెట్రా బాంబుల్ని వేసిందట. తన ఆట కట్టించడానికే కోడలు ఈ ఎత్తువేసిందని తెలుసుకున్న అత్తగారు ఏమీ మాట్లాడలేక కోపంగానే హారతి పట్టిందట"

"అబద్ధం అని అరిచి అందరికీ చెప్పొచ్చుగా" అడిగాడు మోహన్.

"ఎదుటివాళ్ళ ఇంట్లోకి దయ్యమో, దైవమో రావడం అబద్ధమైనప్పుడు మరి తన ఒంట్లోకొచ్చేది కూడా అబద్ధమని ఒప్పుకోవాలిగా. అత్తగారిగా అలా ఒప్పుకోవడం జరిగే పనేనా? నో. దొంగకు తేలు కుట్టినట్టయింది. అత్తా కోడళ్ళిద్దరూ కాంప్రమైజ్ అయిపోయారు. కథ శుభం అయింది" నవ్వుతూ ముగించింది శారద.

"నైస్ బట్ సెన్సిటివ్ ట్రీట్‌మెంట్" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"నేనున్నాను" అంటూ డ్యూయెట్ నవ్వు నవ్వేసింది లత.

"మీ డ్యూయెట్‌కు నేనెందుకడ్డ " అనుకొని నవ్వుతూ బాబిగాణ్ణెత్తుకుని ప్రక్కగదిలో కెళ్ళిపోయింది శారద.


*With the Best Compliments*

FROM

Phones : Hotel : 75461 – Res. : 77318

"DURGA VILAS"

HIGH CLASS NON - VEGETARIAN MEALS HOTEL

AIR CONDITION & ROOF GARDEN

BESANT ROAD : : VIJAYAWADA - 2

*Special arrangements for :* DINNER PARTIES

*Props. :* K. Sambasiva Rao, V. Raghavendra Rao & Co.,